# లేటు

-యస్.వివేకానంద



ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

ఎక్కవలసిన రైలు జీవితకాలం లేటు! ఇదొక మహాకవి సూక్తి.

చాలామంది జీవితాల్లో పరిస్థితులు ఇలాగే వుంటయ్! అది దురదృష్టం!

టౌన్‌కి దూరంగ వున్న లేబర్ కాలనీలో వుంటోంది పోచమ్మ!

మొగుడు రోజూ పూలు తెచ్చి మాలకట్టి సైకిలు మీద తిరిగి అమ్మి తెచ్చిన డబ్బుతో కలోగంజో తాగి బ్రతుకుతున్నారు.

పోచమ్మకి పెళ్ళయిన చాలా ఏళ్ళకి ఓ ఆడ పిల్లని ప్రసవించింది. లేక లేక కలిగిన ఒక్కగానొక్క అమ్మాయి కావటంతో కూతుర్ని అపురూపంగా చూసుకుంటోంది.

మొగుడు పూలమ్మి సంపాదిస్తుంటే పోచమ్మ మాత్రం కూతురు ఆలనాపాలనా చూస్తూ సంబరపడుతోంది.

తన కడుపు పండినందుకు పోచమ్మలో కలిగిన ఆనందం నెల తిరక్కుండానే ఆవిరైపోయింది.

పూలమ్మి చీకట్లో ఇంటికి తిరిగొస్తున్న సైదులు సైకిల్ని ఓ లారీ గుద్దేసింది.

యాక్సిడెంట్ చేసిన లారీ దూసుకువెళ్ళిపోయింది.

సైదులు సైకిలు తుక్కుతుక్కైంది. నెత్తుటి మడుగులో పడి కొట్టుకుంటున్న వాడిని చుట్టూ మూగిన జనం చూస్తూ జాలిపడి ధర్మాసుపత్రికి తీసుకెళ్ళారు.

రాత్రి పొద్దుపోయినా మొగుడు రాకపోవటంతో పోచమ్మ కంగారుపడ్డది.

ఇంత రేతిరైనా ఇంకా రానేదేంది... యాడికి పోయుంటడు?... పూలమ్మిన డబ్బుల్తో యాడైనా తాగి పడిపోయాడా...?... తన్లోతాను గొణుక్కుంది.

గుడిసెలో ఉక్కపోతగా వుండటంతో పసిదాన్ని భుజానేసుకుని బైట గాలికి అటు ఇటు తిరుగుతోంది.

'నువ్వేనా సైదులు పెళ్ళానివి...' గద్దింపుకి వెనక్కి తిరిగింది పోచమ్మ.

ఎదురుగా పోలీసు అగుపించటంతో నివ్వెరపోయింది.

'నేనే సారూ...' జవాబిచ్చింది.

'నీ మొగుడికి యాక్సిడెంటయింది. నీ పుస్తెల తాడు గట్టిది కావటంతో బతికాడు.' కానీ... ... విషయం పూర్తిగ చెప్పటమూ వద్దని ఆగేడు.

"అయ్యో దేవుడా... మరి... నా సైదులు యాడున్నాడు సారూ..." తత్తరపాటుతో అడిగింది.

"గవర్నమెంట్ ఆసుపత్రిలో వున్నాడు. నీకీ సంగతి చెప్పటానికే వచ్చా!- నువ్వు వెళ్ళి నీ మొగుడ్ని చూసుకో...". తిరిగి వెళ్ళిపోయాడు పోలీసు.

బిడ్డని చంకనేసుకుని గుడిసెకున్న తడిక తలుపు దగ్గరకు లాగి లబోదిబోమంటూ ధర్మాసుపత్రివేపు పరుగు పెట్టింది.

★ ★ ★

యాక్సిడెంట్లో నుజ్జు నుజ్జయిన కారణంగా తీసేసిన తన రెండు కాళ్ళవేపు పదే పదే చూసుకుని కుమిలిపోసాగేడు సైదులు.

కష్టపడి నాలుగు రూపాయలు సంపాదించుకోలేని దుస్థితి తనది.

"కళ్ళ నీళ్ళు పెట్టుకోమాకయ్యా... నా రాత బావుండి నువ్వు బతికి బట్టకట్టావు. లేకపోతే నేను పిల్లా అనాదలమైపోయేవాళ్ళం... తెలుసా...!?-" పోచ్చమ్మ మొగుడ్ని వోదారుస్తూ ధైర్యాన్ని నూరిపోసింది.

"నా బతుకిట్టా అయిపోనాది. నీ కష్టంమీద బతకాల్సి వచ్చింది... ఆ దేవుడికి కూడా మన్లాంటి బీదోళ్ళ మీద దయలేదే... ఇట్టా బతికే కుంటితనం నాకేటికీ?... నే...బతికితేనేం... సత్తేనేం..." తనకు సంభవించిన అంగ వైకల్యానికి బావురుమన్నాడు.

"నేనేదో నాలుగిళ్ళల్లో పాచి పని చేస్తుండా గదా... మన మూడు పొట్టలు గడవకపోవు..." చాటలో వున్న నూకల్లో రాళ్ళేరుతూ అంది.

"నా సంగతికేమొచ్చింది గానీ... ఆ పిల్లదేందీ ఎప్పుడూ ఏడుత్తా వుంటది... నీకాడ పాలు సాలటం లేదా ఏంది?..."

చింత చెట్టుకొమ్మకి వేలాడుతున్న గుడ్డ వుయ్యాల్లో ఏడుపు లంకించుకున్న కూతురు వేపు చూస్తూ అడిగేడు.

"ఇది పుట్టిన నాటినుంచీ ఇట్టాగే వుండాదయ్యా. ఓమారు ఆసుపత్రికి తీసుకెళ్ళి మంచి డాకటేరుకి చూపించాల!"

"అదేందో తొందరగా చూడు! ఈ ఏడుపుతో పిల్లరేకట్టటంలేదు..."

"అద్సరేగానీ... నువ్విట్టా ఎన్నాళ్ళు ఇంటికాడే వుంటావ్... వడ్రంగితో చెప్పి నీకు చంక కర్రలు చేపించనా?..."

"అది కాదే... మన్లాంటి బీదోళ్ళకి... మూడుచక్రాల బండి వూరికే ఇస్తారంట కదా జండా పండగ రోజు!... నువ్వు పాచిపని చేసే పీడరు గారింటికెళ్ళినపుడు ఎవరికి మనం అర్జీ పెట్టుకోవాలో అడిగి తెల్సుకుని... కూసంత సాయం చేసిపెట్టమని బతిమిలాడరాదూ?..."

"అవునయ్యోవ్... సమయానికి గుర్తు చేశావు. నేను అడుగుతాలే! పీడరుగారు సాన మంచోడు. మనకు తప్పకుండా అర్జీ రాసిపెట్టి సాయం సేత్తాడు..."

చాటలో ఏరిన నూకలతో గుడిశలోకెళ్ళి పొయ్యి వెలిగించింది పోచమ్మ.

⁘ ⁘ ⁘

పసిపిల్లని చంకనేసుకుని పోచమ్మ దరమాసుపత్రికి చేరింది.

ఏడుస్తున్న పిల్లని సముదాయిస్తూ పిల్లల డాక్టరున్న వార్డువేపు నడిచింది.

అక్కడ చాలామంది వుండటం చూచిన పోచమ్మ "డాకటేరు బిడ్డని పరీచ్చించటానికి సానాసేపు అయ్యేట్టుందే..." తన్లోతాను గొణుక్కుంటు వరసలో బెంచీ మీద కూర్చుంది.

పోచమ్మ వంతు వచ్చేసరికి రెండుగంటలు పట్టింది.

పరీక్ష చేసిన డాక్టర్ 'పిల్ల యింత అర్భకంగా వుందేం?'

"ఎప్పుడూ ఏడుస్తావుంటది డాక్టర్ బాబూ! - తాగే

పాలు ఏమవుతాయో ఏమో... పిల్ల వళ్ళు చేయటం లేదు..."

పోచమ్మ వేపు పిల్లవేపు మార్చి మార్చి చూసిన డాక్టర్ "చూడూ!- నీ పిల్లకి ఎక్సరే తీయించు... తర్వాత ఇ.సి.జి. తీస్తారు. అదయ్యాక ఇంటికెళ్ళి రెండురోజులు ఆగి మళ్ళీరా! జబ్బేమిటో అప్పటికి నిర్ధారించచ్చు. ఆ తర్వాత మందిస్తాను..." చేతిలో కాయితాలు పెట్టాడు డాక్టర్.

* * *

పిల్లదాన్ని వొడిలో పెట్టుకుని ఆకాశంలోకి చూస్తున్నాడు సైదులు. తన ఎదురుగా ఎవరో వచ్చి నిలబడిన అలికిడి అవటంతో దృష్టి మరల్చి "నువ్వా చంటబ్బాయ్ గారూ... ఏందిట్టా వచ్చారు..." రెండు చేతులతో దణ్ణం పెడుతూ వినమ్రంగా మాట్లాడేడు సైదులు.

"అది గాదురా... నువ్వు కుంటోడివయ్యావు గదాని మూడు చక్రాల బండికి దరఖాస్తు పెట్టుకోగానే గవర్నమెంటు ఇచ్చేస్తుందా నీ మీద జాలిపడి?..." చంటి మాటల్లో చిరుకోపం ధ్వనించింది.

అక్కడి గుడిసెవాసుల్లో కాస్తంత అక్షరంముక్క వచ్చిన వ్యక్తి చంటి. కాస్తంత గంజిపెట్టిన పాంటు షర్టు వేసుకుని ఛోటా నాయకుడిలాగ వ్యవహరిస్తూంటాడు. పై వాళ్ళకి లంచాలు ఇప్పిస్తూ తన కష్టానికి కాస్తో కూస్తో నొక్కేసి బాగుపడే తెలివితేటలు బోలెడున్నమనిషి.

"చూడు సైదులూ!- నీకు జెండా పండక్కి మూడుచక్రాల సైకిలుబండి కావాలంటే... పెద్దోళ్ళ చేతులు తడపాల!- లేకపోతే నీకు పని కాదు. తెలుసుకో..."

"ఎంత కరుచవుతుంది?..." ఆశగ అడిగాడు సైదులు.

"ఎంతోనా... ఓ వెయ్యి కొట్టు!" మిగతావి నేను చూచుకుని జెండా పండక్కి నీకు బండి ఇప్పిచ్చే పూచీ నాది."

"వారి దేవుడో... వెయ్యే?-" దీర్ఘంతీస్తూ నోరు తెరిచాడు.

"కట్టంచేసి బతికే వోళ్ళం. మీకు తెలియనిది ఏముంది చెప్పండి!- బీదోళ్ళకాడ... నాలాంటి అవిటోడి దగ్గర వెయ్యి రూపాయలు ఏడుంటాయండీ..." సైదులు మాటల్లో జాలి వుట్టిపడ్డది.

"అయితే ఇంకేం... నీ ఖర్మ!- డబ్బులు లేకపోతే నీకు బండి రాదు. ఆలోచించుకో!... మళ్ళా వస్తా... ఏ విషయం చెప్పు!- అవతల చాలామంది క్యూలో సాయంకోసం డబ్బు పట్టుకుని నిలబడ్డారు. తెలుసా..." చెప్పాల్సింది చెప్పి దులబరించుకు వెళ్ళిపోయాడు చంటి.

చలనం లేని మరబొమ్మలా వుండిపోయాడు సైదులు.

* * *

మూడు నెలలైనా నిండని పసిదానికి గుండె జబ్బని... గుండెలో రంధ్రం పడిందని... వెంటనే ఆపరేషన్ చేయిస్తే గానీ బతకదనీ... అందుకు సుమారు లక్షా యాభైవేల దాకా ఖర్చవుతుందని... డాక్టర్ బాబు చెప్పినప్పుడు నిర్ఘాంతపోయింది పోచమ్మ.

ఈ మాయదారి ఖరీదైన జబ్బు తన బిడ్డకే రావాలా?... కష్టం చేసుకు బతికే తను అంత డబ్బు పోసి లేకలేక కలిగిన ఒక్కగానొక్క కూతురుని ఎలా బ్రతికించుకోవాలో బోధపడలేదు.

పోచమ్మ కళ్ళవెంట ధారాపాతంగ వెలువడిన కన్నీటికి డాక్టర్ కరిగిపోలేదు.

"నువ్వు బిడ్డని బ్రతికించుకోవాలనుకుంటే... నువ్వు నీ పసి దానికి ఆపరేషన్ చేయించక తప్పదు. డబ్బు ఖర్చుపెట్టక తప్పదు. ఆ తర్వాత నీ ఇష్టం!... ఇక వెళ్ళచ్చు..." చివరిగా నాలుగు మాటలు చెప్పి పోచమ్మను పంపించేశాడు డాక్టర్.

పోచమ్మలో దిగులు... బాధ... ఆవేదన ఆమెను కృంగతీసినయ్. సంపాదించే మొగుడే అవిటివాడై కుటుంబాన్ని పోషించలేని పరిస్థితి. తాను నాలుగు ఇళ్ళల్లో కష్టపడి పాచిపన్లుచేసి కాస్తోకూస్తో తెచ్చుకుంటూ భర్తని బ్రతికించుకుంటూ తానూ బ్రతుకీడ్చగలుగుతోంది.

ఇప్పుడేమో... పిల్లకి మాయదారి గుండెజబ్బు వచ్చిపడ్డది. లేకలేక పుట్టిన ఒక్కగానొక్క కూతుర్ని బ్రతికించుకునే శక్తి తనకు లేదు.



పిల్లకి గుండె జబ్బనే విషయం సైదులికి ఎలా చెప్పటం?... చెప్పకుండా ఎన్నాళ్ళని దాచటం...?

ఓరి భగవంతుడా... ఏమిటీ దుస్థితి?... ఎందుకయ్యా మావంటి బీదవాళ్ళని పుట్టిస్తావ్?... తననుతాను నిందించుకుంది. దేవుడినీ శాపనార్థాలు పెట్టింది.

* * *

"నీ వంటి నిష్ఠ దరిద్రుల సంతానానికి రావలసిన జబ్బు కాదు పోచమ్మా యిది. - ఏం చేస్తాం?... గుండె దిటవు చేసుకో... అందరిని రక్షించేవాడు ఆ దేవుడే..."

కూతురు చచ్చిపోయిన ఏడాదికి అందిన సాయానికి సంతోషించాలో... బాధను గుర్తుకు తెచ్చుకుని కుమిలిపోవాలో అర్థంకాని సైదులు గుడిసె గోడకి జారగిలపడ్డాడు!

పోచమ్మ దుస్థితికి జాలిపడ్డ వకీలు దామోదరం వూరడింపు మాటలతో ధైర్యాన్ని నూరిపోశాడు.

"కట్టుకున్నాడు కుంటోడైనాడు. కన్నబిడ్డకేమో నయం చేయించి బ్రతికించుకోలేని గుండె జబ్బు వచ్చిపడ్డది. నాకు కాలు చెయ్యి ఆడటంలేదు పీడరు బాబూ... తమబోటి వారే సాయపడి నాలాంటి బీదోళ్ళని ఆదుకోవాల..." పోచమ్మ కాళ్ళావేళ్ళా పడ్డది.

"నువ్వు మా ఇంట్లో పనిచేసే దానివే అయినా మా ఇంట్లో తలలో నాలుక లాగ కల్సిపోయావ్. నీ మంచితనం మా పట్ల నీకున్న అభిమానానికి బదులుగా ఓ వందో వెయ్యో ఇవ్వగలను. అంతేగానీ నీ కూతుర్ని బ్రతికించుకోవటానికి నీకు అంత డబ్బు నేనివ్వాలీ అంటే సాధ్యమా చెప్పు?!-"

"ఈ ఆపద నుంచి తమరేనన్ను బైటపడేయాల..." పైటతో కళ్ళొత్తుకుంది పోచమ్మ.

"చందాలెత్తినా నీకు అంత డబ్బు కూడపెట్టటం అంటే... అయ్యే పనికాదు. ఆఁ!... నాకో ఆలోచన వచ్చింది. నీలాంటి బీదవారికి సాయపడేటందుకు ముఖ్యమంత్రిగారి సహాయనిధి నుండి డబ్బు శాంక్షన్ చేయగల అవకాశమొకటి వుంది- నీచేత దరఖాస్తు పెట్టిస్తాను- ఏమైనా ఉపయోగముంటుందేమో చూద్దాం!- ఆపైన నీ ప్రాప్తం!... పిల్లదాని అదృష్టం!- ఏమంటావ్..."

"నాకేం తెలుసుద్ది బాబూ... అదేదో తమరే చేసి పెట్టాల!-"

"నీకు ఆస్పత్రిలో డాక్టర్ ఇచ్చిన కాయితాలు రేప్పొద్దెప్పుడు తెచ్చి నాకివ్వు! నేను మిగతా ఏర్పాట్లుచేస్తాను. సరేనా!?- సర్లే... నువ్వెళ్ళి పని చూసుకో..."

అయ్యగారితో తర్వాత తీరుబడిగా మాట్లాడుదువుగాని... ముందు దొడ్లోకెళ్ళి అంట్లు తోమి బట్టలు వుతికే పని చూడు అంటూ ప్లీడరుగారి భార్య కేకేసి చెప్పటంతో దొడ్లోకి నడిచింది పోచమ్మ.

* * *

జెండా పండుగ జరిగింది! ఓ వంద మంది వికలాంగులకు మూడు చక్రాల బండ్లను సాయం చేసింది ప్రభుత్వం!

కానీ... వేయి రూపాయలు లంచం బ్రోకర్ చంటబ్బాయికి ఇచ్చుకోలేకపోయిన అవిటి సైదులికి మాత్రం బండి మంజూరవలేదు. ఆ కారణంగా మానసికంగా మరింత కృంగిపోయాడు సైదులు. పోచమ్మ మాత్రం చంటబ్బాయిని ఆ రోజంతా తిట్టిపోస్తునే వుంది.

తన అశక్తతకు మరోసారి కళ్ళనీళ్ళు పెట్టుకోక తప్పలేదు సైదులు.

రోజులు... వారాలు... నెలలు దొర్లిపోతున్నాయ్!-

"సైదులూ... వున్నావా... నీకో వుత్తరం వచ్చింది" సైకిలు స్టాండు వేస్తూ పోస్ట్‌మేన్ అన్నాడు.

"ఉత్తరవా!... నాకా... చదివే రానోడికి వుత్తరం రాసేదెవరయ్యా?..."

"ఇదేదో కవరు... ఇంద! తీసుకో..." సైదులుకి అందించాడు.

"యాడనుండొచ్చిందో కాస్తంత సదివి చెప్పరాదూ నీకు పుణ్యం వుంటుంది..."

"ఇదేదో ఇంగ్లీషులో వుంది సైదులూ... చదివి చెప్తాలే..."

వుత్తరాన్ని ఆసాంతం చదివి "నీ అదృష్టం పండిందయ్యా! నీ బిడ్డ ఆపరేషన్‌కోసం పెట్టుకున్న అర్జీ గవర్నమెంటు వప్పుకుని ముఖ్యమంత్రిగారి సహాయ నిధి నుండి లక్షా యాభైవేలు సాయం అందిస్తున్నట్టు వుందయ్యా మొత్తానికి మహర్జాతకుడివి!- నీకు తిండికి లేకపోయినా ... ప్రభుత్వం కనికరించి సాయం చేసింది. సంతోషించు! - మరి నేవస్తా... ఇంద... ఈ లెటర్ జాగ్రత్తగా వుంచుకో..." వెళ్ళిపోయాడు పోస్ట్‌మేన్.

సైదులు చేతిలో వుత్తరం... కంటిలో నీరు... మూగవోయిన కంఠం. హృదయంలోంచి తన్నుకొస్తున్న ఆవేదన... కట్టలు తెంచుకున్న దుఃఖం... మనిషిని కలచివేసింది.

సరైన వైద్యం చేయించలేక సమయానికి సాయం అందకపోవటంతో కన్నబిడ్డని ఎత్తుకెళ్ళాడు దేవుడు.

కూతురు చచ్చిపోయిన ఏడాదికి అందిన సాయానికి సంతోషించాలో... బాధను గుర్తుకు తెచ్చుకుని కుమిలిపోవాలో అర్థంకాని సైదులు గుడిసె గోడకి జారగిలపడ్డాడు!

★